ఆక్వా సాగుకు వాతావరణ ముప్పు

- రోజుకో రకంగా వాతావరణ మార్పులతో ఇక్కట్లు
- ఆక్సిజన్ అందక మృత్యువాత పడుతున్న రొయ్యలు
- తెగుళ్ల దాడి అధికమవడంతో తీవ్ర నష్టం



కాట్రేనికోన ఆక్వా చెరువులో ఏర్పాటు చేసిన ఏరియేటర్లు

కాట్రేనికోన: వాతావరణం హఠాత్తుగా మారి చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి లోపించడంతో మత్స్యసంపద మృత్యువాత పడుతోంది. అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు, మామిడికుదురు, రాజోలు, మల్కిపురం మండలాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. చేపల సాగు, రొయ్యలు, చేపలను పాలీకల్చరు పద్ధతుల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇటీవల గచ్చకాయలపోరలో పండుగప్ప చేపలు చెరువులో ఆక్సిజన్ స్థాయి తగ్గిపోవడంతో మృత్యువాత పడ్డాయి. పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు, సాయంత్రం మబ్బులు ఏర్పడి వర్షాలు కురవడంతో చెరువు నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గడంతో ఆక్వా సాగుకు మారుతున్న వాతావరణం అవరోధంగా మారింది. కొన్ని రకాల మేత కారణంగా చెరువుల్లోని నీటి నాణ్యత, మట్టి నాణ్యత దెబ్బతిటోంది. చేపలు, రొయ్యలు తినగా మిగిలిన మేత చెరువు అడుగు భాగానికి చేరి కుళ్లిపోవడంతో అమ్మోనియం, నైట్రేట్ వంటి విష వాయువులు తయారవుతున్నాయి. చెరువు నీటి నాణ్యతను పెంచేందుకు, విష వాయువుల స్థాయి తగ్గించేందుకు జియోలైట్ వంటి మందులను ఫ్లాంటేషన్ ఉత్పత్తి కోసం రైతులు అధిక ఖర్చు చేయవలసి వస్తోంది.

వెంటాడుతున్న విద్యుత్ కోతలు

రొయ్యల సాగులో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు చెరువుల్లో రైతులు ఏరియేటర్లు అమర్చుతారు. అధిక ఉష్ణోగ్రతలకు తోడు అడ్డూఅదుపు లేకుండా విద్యుత్ శాఖ అనధికారిక విధిమచే కరెంట్ కోతలతో ఆక్వా రంగానికి నష్టం ఏర్పడుందని రైతులు అంటున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక డీజిల్ ఆయిల్ వినియోగించి జనరేటర్లతో ఏరియేటర్లు తిప్పలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. దీంతో ఖర్చులు అధికమవుతున్నాయని వారన్నారు. చెరువుల్లోని రొయ్యలు ఏరియేటర్ల దగ్గరకు చేరి అధిక మొత్తంలో చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

> **ఆక్సిజన్ స్థాయి పడిపోతోంది**
>
> అధిక ఉష్ణోగ్రతలతో పాటు కరెంట్ కోతలు అధికంగా ఉండటంతో చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి తరచూ పడిపోయి చేపలు నీటి పైకి వచ్చి ఈదుతున్నాయి. చెరువులోని రొయ్యలు తిరుగుతున్న మోటారు ఏరియేటర్ల దగ్గరకు వచ్చి చనిపోతున్నాయి.
>
> – శివ, ఆక్వా రైతు, గెద్దనపల్లి

రొయ్యలు బలహీనంగా ఉండటంతో వ్యాధుల దాడి

చెరువులో ఆక్సిజన్ సక్రమంగా అందక చేపలు, రొయ్యలు బలహీనంగా ఉండటంతో బ్యాక్టీరియా, వైరస్ వ్యాధులు వాటిపై దాడి చేస్తున్నాయి. రొయ్యల్లో వైట్‌స్పాట్, విబ్రియో వంటి వ్యాధులు, చేపల చెరువులో రెడ్ డిసీజ్, తాటాకు తెగులు, పేను తదితర వ్యాధులు అధికంగా ఉండటంతో వాటి నివారణకు మందుల కోసం అధికంగా ఖర్చు చేయవలసి వస్తోందని ఆక్వా రైతులు వాపోతున్నారు.

క్లుప్తంగా

డీఎల్‌డీవోగా వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పూలమొక్కను అందిస్తున్న డీఎల్‌డీఓ వేణుగోపాల్

అమలాపురం రూరల్: డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి జె. వేణుగోపాల్ శుక్రవారం డీఎల్‌డీవోగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా శుక్రవారం కలసి పూల మొక్కను అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువకావడం ద్వారా డివిజన్ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని డీఎల్‌డీఓకు సూచించారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

యానాం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నికల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన పుదుచ్చేరి, ఇతర రాష్ట్రాల అభ్యర్థులు ప్రథమ సంవత్సరం డిప్లొమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగాలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్టు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

భైరవమూర్తికి పలువురి పరామర్శ

తాళ్లరేవు: ఇటీవల హైదరాబాద్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పొన్నాడ భైరవమూర్తిని శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, నాయకులు పరామర్శించారు. పరామర్శించినవారిలో పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, తాళ్లరేవు ఎంపీటీసీ సభ్యుడు రత్స ముత్యాలరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వర్లు, నాయకులు వైదాడి ధర్మారావు, చిట్టూరి చలపతి, కొల్లు శ్రీనివాసరావు, విత్తనాల పండు, ఈశ్వరరావు, మణికంఠ, కొండయ్య, ప్రసాద్ ఉన్నారు.

22న అసిస్టెంట్ (టైర్–2) రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ (టైర్–2) రాత పరీక్షను ఈనెల 22న ఆదివారం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం డీపీఅండ్ఏఆర్ ఎగ్జామ్ సెల్ అధికారి జయశంకర్ తెలిపారు. అభ్యర్థుల రాత పరీక్ష కోసం యానాంతో పాటు పుదుచ్చేరి, కారైకల్, మాహే రీజియన్లలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లను రిక్రూట్‌మెంట్.పీవై.జీటీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 0413–2233338 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఉచిత విద్య పథకాన్ని అమలు చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా షెడ్యూల్డు కులాలు, తెగల విద్యార్థులకు, సామాజికంగా అణగారిన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య పథకం అమలును నీరుగారుస్తున్నారంటూ శుక్రవారం సీపీఐ నాయకులు శుక్రవారం అసెంబ్లీ సమీపంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత విద్య పథకం అమలుకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో సీఎం రంగసామి జోక్యం చేసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఉచిత విద్య పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

5న లోక్ అదాలత్

అమలాపురం టౌన్: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల జూలై 5న అమలాపురం కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఆ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ తెలిపారు. ఈ లోక్ అదాలత్ ద్వారా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, బ్యాంక్, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. న్యాయవాదులు, పోలీస్, బ్యాంక్, రెవెన్యూ అధికారులు లోక్ అదాలత్‌లో పాల్గొని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని న్యాయమూర్తి గోవర్ధన్ కోరారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

అమలాపురం రూరల్: పాత బండారులంక వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం 7వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా అత్తిలింగం, వీరభద్ర మణి దంపతులు కర్తలుగా గుమ్మడి సద్గురువు సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్‌కు సత్కారం



జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో 153వ ర్యాంక్ సాధించిన సుకుమార్‌ను సత్కరించిన శ్రీరామనగర్ వాసులు

అమలాపురం టౌన్: ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 153వ ర్యాంక్ సాధించిన అమలాపురంలోని శ్రీరామనగర్‌కు చెందిన విద్యార్థి పరమట సుకుమార్‌ను స్థానికులు శుక్రవారం ఘనంగా సత్కరించి అభినందించారు. శ్రీరామనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ విజేత సుకుమార్‌తోపాటు అతని తల్లిదండ్రులైన ప్రసాదరావు, లీలాకుమారిని వారు అభిందించారు. వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన సుకుమార్ పదో తరగతి వరకూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ పట్టణంలోనే ఓ ప్రైవేటు కళాశాలలో చదివివాడు. శ్రీరామ్‌నగర్ వాసులు ఆర్టీసీ రిజర్వేషన్స్ సూపర్‌వైజర్ నంది వరహాల బాబు, విద్యుత్ శాఖ ఉద్యోగి ఎస్.సంపతరావు, తెలుగు అధ్యాపకుడు ఎస్.శ్రీనివాసబాబు, ది అమలాపురం డిగ్రీ, జూనియర్ కళాశాలల డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సుకుమార్‌కు అభినందించి సత్కరించారు. ప్రతిష్టాత్మక ఐఐటీలో సీటు సాధించి ఉన్నత ఉద్యోగంతో జీవితంలో స్థిరపడాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్న సుకుమార్ ప్రోత్సహిస్తామని వారు స్పష్టం చేశారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి

అల్లవరం: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, క్షయ లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా చికిత్స పొందాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డి.రావులపాలెంలో సర్పంచ్ ఉండ్రు భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్ భరతలక్ష్మి మాట్లాడుతూ జ్వరం, ఛాతిలో నొప్పి, తెమడతో కూడిన దగ్గు, అలసట, నీరసం, రాత్రిపూట చెమట, బరువు తగ్గడం, శారీరక ఆరోగ్యంలో మార్పులు రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆలస్యం చేయకుండా మీకు దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంటెద్దు సీతారామయ్య, డాక్టర్ వెంకటేష్, ఆరోగ్య సిబ్బంది, మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



విమాన ప్రమాద మృతులకు శాంతి ర్యాలీతో సంతాపం తెలుపుతున్న అమలాపురం వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో అశువులు బాసిన ప్రయాణికులు, మెడికో విద్యార్థులకు అమలాపురం వాకర్స్ క్లబ్ కొవ్వొత్తుల శాంతి ర్యాలీతో శుక్రవారం రాత్రి ఘనంగా నివాళులర్పించింది. స్థానిక గడియారం స్తంభం సెంటరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలు శాంతించాలని వాకర్స్ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యం వహించారు. ఈ ర్యాలీలో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

ముమ్మిడివరం: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని, మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ ముమ్మిడివరంలో అభ్యుదయ సంఘాల నాయకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కాశీవాని తూము నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పలు ప్రజా సంఘాల నాయకులు, అభ్యుదయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాలువలకు నీటి విడుదల



పోలేకుర్రు ఇరిగేషన్ కార్యాలయం డివైడింగ్ డ్యాం వద్ద పూజ అనంతరం నీటిని విడుదల చేస్తున్న నీటి సంఘాల ప్రతినిధులు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఆయకట్టు భూములకు సాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు చేపడతామని మండల వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు తెలిపారు. శుక్రవారం పోలేకుర్రు ఇరిగేషన్ కార్యాలయం డివైడింగ్ డ్యాం వద్ద పలువురు సర్పంచ్‌లు వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ నీటి సంఘాల అధ్యక్షులు అల్లూరి రామకృష్ణంరాజు, ధూళిపూడి గోపి, ఎం.శ్రీనివాసరావు, అల్లూరి సాయిరాజు తదితరులతో కలసి ప్రత్యేక పూజల అనంతరం కోరంగి, గాడిమొగ, పి.మల్లవరం కాలువలకు నీటిని విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ అనూష, నాయకులు వీరన్నయాదవ్, నిమ్మకాయల మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ ఆవరణలో వివిధ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు బీసీ వెల్ఫేర్ శాఖ ద్వారా మంజూరైన 300 ఉచిత సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. కేఎస్‌జీజీ, ఎమ్‌జీజీబీహెచ్, కనకాలపేట ఎస్‌కేఎస్‌పీవీఆర్‌ఎస్‌జీహెచ్ పాఠశాలల్లో సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకర్, అధికారి చింతా రామజోగి, వివిధ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి



పోలేకుర్రు వై.జంక్షన్ చెక్‌పోస్టు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

తాళ్లరేవు: రోడ్డు ప్రమాదాలు సంభవించినపుడు హెల్మెట్ ధరించకపోవడంతో తలకు బలమైన గాయమై అధిక శాతం మంది మృత్యువాత పడుతున్నారని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం జాతీయ రహదారి 216లోని పోలేకుర్రు వై.జంక్షన్ చెక్‌పోస్టు వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రమాద తీవ్రత తగ్గుతుందన్నారు. వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరంగి పోలీస్ స్టేషన్ సిబ్బంది, చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్ఎం కళాశాల విద్యార్థినికి ప్రతిభా అవార్డు



షైనింగ్ స్టార్ అవార్డును కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా అందుకుంటున్న విద్యార్థిని రమ్య

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో ఉన్న సీఎస్ఎం, ఎమ్ఎస్ఎస్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 971 మార్కులు సాధించిన గోసంగి రమ్యకు ప్రభుత్వ ప్రతిభా పురస్కారాల్లో భాగంగా షైనింగ్ స్టార్ 2025 అవార్డు వరించింది. ఈ అవార్డును కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని అందించి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది శుక్రవారం రమ్యను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు చిక్కం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, కరస్పాండెంట్ చిక్కం వెంకట రాజేంద్రప్రసాద్, ట్రెజరర్ మోటూరి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ కంచుమర్తి బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ తోకల దుర్గా ఈశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనల పేరుతో తల్లికి వందనంలో కోత వద్దు



రమేష్

అమలాపురం రూరల్: తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో వాగ్దానం చేసిన మేరకు తల్లికి వందనం నగదును అర్హులైన విద్యార్థులందరికీ నిబంధనలు సడలించి తల్లుల ఖాతాల్లో జమ చేయాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ రమేష్ జిల్లెళ్ల డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ అడ్డగోలు నిబంధనలతో దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో 2.5 లక్షలు, పట్టణాల్లో 3 లక్షలలోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ తల్లికి వందనం వర్తింపజేయాలని, ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ నగదు జమ చేయాలని ఆయన డిమాండ్ చేసారు. స్కీం వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. రూ.15 వేలు నేరుగా తల్లుల ఖాతాలకు జమ చేస్తామని చెప్పి, ఇప్పుడు రూ.2,000 మినహాయించారని ఆయన విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లబ్ధిదారులతో సంబంధం లేకుండా పాఠశాలల్లో చదువు లున్న పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేయాలని ఆయన కోరారు.

సైకిల్ స్టాండ్‌లో తనిఖీ

నిర్వాహకుడికి జరిమానా



సైకిల్ స్టాండ్‌లో తనిఖీ అనంతరం ధరల పట్టిక బోర్డును ఏర్పాటు చేయించిన ఆర్టీసీ అధికారులు

సాక్షి ఇంపాక్ట్

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అధిక రేట్లు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంపై సైకిల్ స్టాండ్‌లో నిలువ దోపిడీ శీర్షికతో శుక్రవారం సాక్షిలో వచ్చిన కథనంపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. డీఎం చల్లా సత్యనారాయణమూర్తి, సీఐ ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి నంది వరహాలబాబు తనిఖీ చేశారు. సైకిల్ స్టాండ్‌లో ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు గుర్తించి స్టాండ్ నిర్వాహకుడికి జరిమానా విధించారు. మరోసారి అధిక రేట్లు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే పూర్తిగా లైసెన్స్ రద్దు చేస్తామని ఆర్టీసీ డీఎం హెచ్చరించారు. అందరికీ కనిపించేలా ధరల పట్టిక బోర్డులను సైకిల్ స్టాండ్‌లో ఏర్పాటు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకులకు గాయాలు

అమలాపురం టౌన్: మోటారు సైకిల్‌పై వస్తున్న తల్లీ కొడుకులను కారు ఢీకొట్టడంతో వారు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడికి చెందిన కందేరి మరియమ్మ, రాజు అనే తల్లీ కొడుకులు మోటారు సైకిల్‌పై అల్లవరం మండలం గూడాలలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి శుక్రవారం ఉదయం తిరిగి వస్తుండగా స్థానిక పేరూరు వై.జంక్షన్ వద్ద ఈ ప్రమాదం జరిగిందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. వీరి మోటారు సైకిల్‌ను అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన కారు వెనక నుంచి బలంగా ఢీకొట్టడంతో తల్లీ కొడుకులు గాయపడ్డారు. ప్రమాదం జరిగాక అక్కడ నుంచి వెళ్లిపోయిన కారును వై.జంక్షన్‌లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించి గుర్తించారు. ప్రమాదానికి బాధ్యులైన కారు డ్రైవర్ వచ్చిన తర్వాత అతనిపై కేసు నమోదు చేస్తామని సీఐ వీరబాబు తెలిపారు. తల్లి మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. గాయపడ్డ తల్లీ కొడుకులు వై.జంక్షన్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఓడలరేవు జెట్టీని పరిశీలించిన మత్స్యశాఖ జేడీ

అల్లవరం: ఓడలరేవు వైనతేయ నదీ తీరంలో గతంలో నిర్మించిన జెట్టీని మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఓడలరేవు నదీ తీరంలో హార్బర్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆనందరావు ప్రతిపాదనలు చేస్తున్నారని జేడీ శ్రీనివాసరావు తెలిపారు. హార్బర్ సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేస్తున్నామన్నారు. రెండు నెలలు నుంచి అమల్లో ఉన్న వేట నిషేధం శనివారం అర్ధరాత్రి నుంచి తొలగించినట్టు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సముద్ర జలాల్లోకి మత్స్యకారులు వెళ్లి యథావిధిగా చేపల వేట సాగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాడి ఉమమహేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, కొల్లు త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

యానాం: నియోజకవర్గ పరిధిలో పరంపట గ్రామ యువకులకు రూ.60వేలు విలువచేసే క్రికెట్ కిట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పరంపేట గ్రామానికి చెందిన యువకులకు క్రీడావస్తువులతో కూడిన క్రికెట్ కిట్‌ను అందజేశారు. త్వరలో మిగిలిన యూత్‌లకు సైతం క్రికెట్ కిట్లు అందజేస్తామని ఆయన తెలిపారు.

వీరేశ్వర స్వామిని దర్శించుకున్న దేవదాయ శాఖ డీసీ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి వారిని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన కుమార్తె వివాహ శుభలేఖ స్వామి వారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు సిబ్బంది ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామి ప్రసాదం, శేష వస్త్రం అందించి వేద ఆశీర్వచనం అందజేశారు. తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, ఆలయ పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరాజు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఉన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌కు సత్కారం

అమలాపురం రూరల్: సాకుర్రు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసిన నందంపూడి శ్రీరామ శరణ్ సేవలు ప్రశంసనీయమని గ్రామస్తులు కొనియాడారు. పదోన్నతిపై కామనగరువు–2 సచివాలయ గ్రేడ్–5 కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన శ్రీరామ శరణ్‌ను సచివాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. డిజిటల్ అసిస్టెంట్‌గా శ్రీరామ శరణ్ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించారని ప్రశంసించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామ శైలజ, గ్రామపెద్దలు ముత్తాబత్తుల రమణ, పాలమూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

28న సుబ్బాలమ్మకు ఆషాఢమాసం సారె సమర్పణ

అమలాపురం టౌన్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ వారికి ఈనెల 28న ఆషాఢ మాసం సారెను సమర్పించనున్నట్లు ఆ ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ మేడిశెట్టి నాగభూషణం తెలిపారు. నగర కన్వీనర్ అర్లపల్లి ముత్యాలరావు (గురు భవాని), సహ కన్వీనర్ కోన వెంకట్రావు (అయ్యప్ప గురు స్వామి) సమక్షంలో అమ్మవారికి సారె సమర్పణతోపాటు సామూహిక హారతి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని మహిళా భక్తులు విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

గొల్లపాలెంలో పీతల హేచరీకి స్థలం

సాక్షి ఇంపాక్ట్

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రయానంలో పసుపు పీతల హేచరీకి ప్రభుత్వం సేకరించిన స్థలం సీఆర్‌జెడ్–ఎ1 పరిధిలో ఉన్నందున జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెంలో సేకరించినట్టు మత్స్యశాఖ జేడీ ఎన్ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. అటకెక్కిన పీతల హేచరీ శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ విశ్రాంత శాస్త్రవేత్త ఎస్ పాండ్యరాజన్ గొల్లపాలెంలో హేచరీ స్థలాన్ని పరిశీలించారన్నారు. చిర్రయానంలో పీతల హేచరీకి కేటాయించిన స్థలాన్ని గతంలో ఫ్లాటస్ హేచరీకి కేటాయించారని, ప్రత్యామ్నాయంగా 5 ఎకరాలను సేకరించామన్నారు.